క్లుప్తంగా

వ్యాసరచన పోటీలకు 80 మంది హాజరు

ఒంగోలు: యోగి వేమన జయంతిని పురస్కరించుకుని స్థానిక డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ హైస్కూలులో బుధవారం జిల్లాస్థాయి వ్యాసరచన, వ్యక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలకు జిల్లావ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి 80 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఒంగోలు ఉప విద్యాశాఖ అధికారి అనిత రోజ్‌రాణి, జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఏడీ సురేఖ, డీసీఈబీ కార్యదర్శి డి.వెంకారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు నివేదిత, తిరుపతయ్య, సమీర్, శ్రీనివాస్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు ఈనెల 18న స్థానిక స్పందన హాల్‌లో జరిగే జిల్లాస్థాయి కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్ ప్రదానం చేస్తామని అనితరోజ్‌రాణి పేర్కొన్నారు.

ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి

ఒంగోలు సబర్బన్: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్‌టీ రామారావు వర్ధంతిని టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. అద్దంకి బస్టాండ్ సెంటర్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తరువాత ఎన్‌టీఆర్ భవన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

టీచర్ ఇంట్లో చోరీ

మార్కాపురం టౌన్: పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలో నివాసం ఉండే టీచర్ కోటేశ్వరరావు ఇంట్లో దొంగతనం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. కోటేశ్వరరావు సంక్రాంతి పండగకు స్వగ్రామం మేదరమెట్ల వెళ్లి బుధవారం ఉదయం ఇంటికి వచ్చాడు. ఇంటి తాళం పగలకొట్టి బీరువాలో ఉన్న 6 వేల నగదును తీసుకెళ్లినట్లు ఆయన తన ఫిర్యాదులో పెర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు గంధ మహోత్సవం

కురిచేడు: స్థానిక నాగూర్‌మీరా ఆవలియా 81వ గంధ మహోత్సవం గురువారం జరగనుంది. కులమతాలకతీతంగా నాగూర్‌మీరా ఆవలియా దర్గా వద్ద ప్రజలు మొక్కలు తీర్చుకుంటారు. గురువారం రాత్రికి భక్తుల సౌకర్యార్థం తాగునీరు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున స్వామివారి గంధ గ్రామోత్సవం చేయనున్నారు.

ఎరువుల వాడకం తగ్గించాలి

తాళ్లూరు: రైతులు ఎరువుల వాడకం తగ్గించి వ్యవసాయాధికారుల సిఫారసు చేసిన మేరకే నత్రకజని, భాస్వరం, పొటాష్ వాడాలని మండల వ్యవసాయాధికారి బి. ప్రసాదరావు తెలిపారు. తాళ్లూరులో బుధవారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ అధికంగా, అనవసరంగా ఒక పోషకం వాడితే అది మరొక పోషక లోపానికి దారితీస్తుందన్నారు. పంట కాలంలో వాడాల్సిన ఎరువులు రెండు విడతల్లో వేస్తే దిగుబడి తగ్గుతుందన్నారు. పంట దశ ఆధారంగా ఎరువులు వాడాల్సిన అవసరం ఉందన్నారు. అనవసరంగా ఎక్కువ మోతాదులో ఎరువులు వాడితే ఖర్చు తప్ప ఫలితం శూన్యమన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులునాయక్,వెంకటరావు, ఏఈఓ నాగరాజు వెంకటరెడ్డిపాల్గొన్నారు.

పేకాట శిబిరాలపై దాడులు

కొత్తపట్నం: పేకాట శిబిరాలపై సెబ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. కొత్తపట్నం మండలంలో గమళ్లపాలెం గ్రామ శివారు ప్రాంతాల్లో శిబిరంపై దాడి చేసి 15 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.8,370 నగదు స్వాధీనం చేసున్నామని ఎస్సై కె.మధుసూదన్‌రావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి గురువారంవారిని కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

గడప గడపలో విశేష స్పందన



దుస్తులు ఇస్త్రీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, పక్కన మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి



పిండి వంటలు తయారు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

- జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందాం
- పార్టీ నాయకులు, లబ్ధిదారులు అండగా నిలవాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: చీమకుర్తి పట్టణంలో బుధవారం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మున్సిపాలిటీలోని 7, 8, 9 వార్డుల్లో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడున్నరేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన బుక్‌లెట్‌లను ఇంటింటికీ తిరిగి అందించారు. ఆయా పథకాల ద్వారా లబ్ధిదారులు ఎంతెంత ప్రయోజనం పొందారో స్థానిక సచివాలయాల ద్వారా సేకరించిన గణాంకాలను ఇంటింటికీ వివరించారు. ఒక్కో ఇంటికి జగనన్న కాలనీలు, వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి, చేయూత, వసతి దీవెన, విద్యాదీవెన వంటి పలు రకాల పథకాల ద్వారా ప్రయోజనం పొందిన వివరాలను వెల్లడించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అందించిన పథకాల్లో ప్రయోజనం పొందని ఇల్లు లేదని, తిరిగిన ప్రతి గడపలో ధ్రువీకరణ అయిందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ తిరిగి పేద ప్రజలకు అందాలంటే తప్పనిసరిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాలని లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ తిరిగే క్రమంలో ఒక చోట ఇస్త్రీ చేయగా.. మరోచోట పిండివంటలు తయారు చేసి బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు ప్రజలను ఆకట్టుకున్నారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబును మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి బుల్లెట్ బండిని ఎక్కించుకొని యువకుల్లో ఉత్సాహాన్ని నింపారు. తొలుత 7, 8, 9 వార్డుల్లోకి ప్రవేశించే సమయంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు పత్తి కోటేశ్వరరావు, సోమా శేషాద్రి, కంజుల ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా పూలమాలలు వేసి హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. వారితో పాటు సాక్షిరామలింగేశ్వర స్వామి ఆలయం కమిటీ చైర్మన్ సూది వెంకట్రావు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. చీమకుర్తి పట్టణంలోని పార్టీ నాయకులతో పాటు రూరల్ పరిధిలోని పార్టీ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బాపతు వెంకటరెడ్డి, నలమల మాణిక్యం, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

ఇంటింటా సాదర స్వాగతం



వడ్డివానికుంటలో కేక్ కట్ చేసేందుకు వచ్చిన బాలినేని శ్రీనివాస రెడ్డికి హారతులు ఇస్తున్న స్థానికులు

ఒంగోలు సబర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికుల నుంచి అపూర్వ స్వాగతం లభిస్తోంది. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి బుధవారం 33వ డివిజన్‌లోని వడ్డివానికుంటలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పూలతో స్వాగతం పలికి, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలను పురస్కరించుకొని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో హారతులిచ్చి బాలినేనిని ప్రేమపూర్వకంగా ఆశీర్వదించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి
- మండల స్థాయి అధికారులు హాజరు కాకపోవడంపై ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి

మద్దిపాడు: మండలంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని అన్నారు. సమావేశంలో ఆమె పలు శాఖల ప్రగతిని సమీక్షించారు. వైద్య ఆరోగ్య శాఖ వారు 104 వాహనాన్ని సచివాలయం వద్దనే ఉంచుతున్నారని, అందువలన అనుబంధ గ్రామాల్లో వృద్ధులకు వైద్యం అందడంలేదని సభ్యులు ప్రశ్నించారు. దీనిపై అనుబంధ గ్రామాలు ఉన్న సచివాలయాల్లో రెండు పూటలు రెండు చోట్ల ఏర్పాటు చేయాలని ఎంపీపీ ఆరోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. రాచవారిపాలెం రహదారిపై వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు మాట్లాడుతూ తమ గ్రామానికి రహదారి ఏర్పాటుపై పలు ప్రశ్నలు పీఆర్‌ఏఈని అడిగారు. గాజులపాలెం, కీర్తిపాడు, రాచవారిపాలెం ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రహదారి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయించాలని ఆయన ఎంపీపీని కోరారు. గ్రామాల్లో ఎస్‌సీఎస్‌టీలకు ప్రత్యేకంగా శ్మశానం ఏర్పాటు చేయిస్తున్నారని ప్రభుత్వ స్థలాలు లేని చోట ప్రైవేటు భూములు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు తహశీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈక్రమంలో గ్రామాల్లో పలు రెవెన్యూ సమస్యలపై తహశీల్దార్‌ను సభ్యులు ప్రశ్నించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు గ్రామ సచివాలయాలకు వచ్చిన క్రమంలో పలువురు సచివాలయ సిబ్బంది కనీస మర్యాద కూడా పాటించడం లేదని మరో మారు వారు ప్రవర్తన మార్చుకోకపోతే వారిని సంబంధిత శాఖకు సరెండర్ చేస్తామని హెచ్చరించారు. మండల స్థాయి అధికారులు పలువురు సర్వసభ్య సమావేశానికి హాజరు కాకపోవడం పట్ల ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరు కాని వారికి నోటీసులు పంపాలని ఏఓ సుబ్బారావును ఆదేశించారు. కార్యక్రమంలో ఆమె వెంట జెడ్పీటీసీ సభ్యురాలు తేళ్ల భాగ్యలక్ష్మి పుల్లారావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహశీల్దార్ లక్ష్మీనారాయణ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీల అధ్యక్షులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత చీమకుర్తి జట్టు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ముండ్లమూరు: మండలంలోని వేములలో పూర్వ గుంటూరు, ప్రకాశం జిల్లాల కబడ్డీ పోటీల్లో చీమకుర్తి జెడ్పీహెచ్‌ఎస్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. మంగళవారం రాత్రి జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చీమకుర్తి, గంగన్నపాలెం జట్లు తలపడ్డాయి. ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో చీమకుర్తి జట్టు మొదటి స్థానంలో నిలవగా 35,116 రూపాయలు, గంగన్నపాలెం జట్టు ద్వితీయ స్థానంలో నిలవగా 20,116 రూపాయలు, మూడో స్థానంలో నిలిచిన వెల్లటూరు జట్టుకు 10,116, నాలుగో స్థానంలో నిలిచిన వేముల జట్టుకు 5,116 రూపాయల నగదు బహూకరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుంకర బ్రహ్మారెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం బహుమతులు బహూకరించిన వారిని నిర్వాహకులు సన్మానించారు. మ్యాచ్ నిర్వహకులు బైలడుగు కృష్ణ యాదవ్, మోతుకూరి శేషు, అంబటి శ్రీనివాసరెడ్డి, కుమ్మిత మహేంద్రరెడ్డి, గజ్జల అశోక్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళకు అరుదైన శస్త్ర చికిత్స



తొలగించిన ప్లీహాన్ని చూపుతున్న వైద్యులు

గిద్దలూరు రూరల్: పట్టణంలో డీజీఆర్ మల్టీ స్పెషాలిటీ వైద్యశాలలో ఓ మహిళకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అరుదైన శస్త్ర చికిత్స చేశారు. స్థానిక రాజానగర్‌లో నివాసం ఉంటున్న షేక్ ఖాసింబీ ఎనిమిదేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. కడుపులో ఎడమ వైపు ప్లీహం పరిమాణం అనూహ్యంగా పెరుగుతుండటంతో వైద్యశాలకు వచ్చిన ఆమెను డాక్టర్ హరినాథ్‌రెడ్డి పర్యవేక్షణలో కర్నూలు కిమ్స్ వైద్యశాలకు చెందిన ప్రముఖ సర్జన్ డాక్టర్ వసీం హసన్ రాజా, మత్తు వైద్యుడు డాక్టర్ శివనాయక్ బృందం ఖాసింబీకి శస్త్ర చికిత్స చేసి ప్లీహాన్ని తొలగించారు. సాధారణ ప్లీహం 12 సెంమీ ఉంటుందని, ఖాసింబీ కడుపులో 34 సెంమీ ఉండి నాలుగున్నర కేజీల బరువు ఉందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా ఉందని చెప్పారు.

ట్రాక్టర్..కారు ఢీ

- నలుగురికి గాయాలు

ముండ్లమూరు: మండలంలోని పెద ఉల్లగల్లు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. విజయవాడ నుంచి పొద్దుటూరు వెళ్తున్న కారు దర్శి-అద్దంకి ప్రధాన రహదారిలో పెద ఉల్లగల్లు వద్ద పొలం నుంచి రోడ్డుపైకి వస్తున్న ట్రాక్టర్‌లు ఢీకొన్నాయి. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఎస్.రామయ్య, సుబ్బారెడ్డిలకు, ట్రాక్టర్‌పై ఉన్న జిల్లెల మూడి వెంకటేశ్వర్లు, రమణమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

శ్రీవారి ఆలయంలో వసంతోత్సవం

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారికి వసంతోత్సవం నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి పర్వదినాన ఆలయంలో శ్రీవారి ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం జరిపించారు. ఆ మేరకు బుధవారం పదహారు రోజుల పండగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవారిని దర్శించుకొని పునీతులయ్యారు. వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు వసంతోత్సవం నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ వేదపండితులు విజయకాంత్ శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీవారి విశిష్టతను భక్తులకు వివరించారు. గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పూజా కార్యక్రమాల్లో పాల్గొని శ్రీవారిని దర్శించుకొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



అలంకరణలో శ్రీవారి ఉత్సవమూర్తులు

కళకళలాడుతున్న వరి



దేవరంపాడు లో దుబ్బు కట్టిన పచ్చని వరి చేలు



ఉలిచిలో వరి చేను

ఒంగోలు రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షాలు కురవడంతో వరి సాగు చేసిన రైతులు కూడా పంటపై ఆశలు దాదాపు వదిలేసుకున్నారు. అయితే అనూహ్యంగా వరి పంట నిలదొక్కుకొని కళకళలాడుతోంది. మండలంలోని దేవరంపాడు, బొద్దులూరివారిపాలెం, ఉలిచి, కరవది, దశరాజుపల్లె, చేజర్ల, సర్వేరెడ్డిపాలెం గ్రామాల్లో వేసిన వరి ఇటీవల కురిసిన వర్షాలకు మరింత సత్తువ పుంజుకుని వేగంగా పెరుగుతున్నాయి. ఉలిచి రోడ్డు నుంచి దేవరంపాడు వరకు పచ్చటి వరి చేన్లు చూపరులను ఆనందింప చేస్తున్నాయి. ఈ వరి పైరు ఇదే విధంగా పెరిగితే రైతన్నలకు గత ఏడాది మాదిరి మంచి దిగుబడులు లభిస్తాయని ఆశిస్తున్నారు. భారీ వర్షాలకు వరి పైర్లు మీదుగా వరద ప్రవాహాలు ప్రవహించినా..భారీ వర్షాలకు నీరు రోజులు తరబడి వరి నాట్లు దశలోనే పంట పొలాల్లో నిల్వ ఉన్నా రైతులు మేలైన వంగడాలు వాడడంతో పైర్లు నిలదొక్కుకున్నాయి. వ్యవసాయాధికారులు, ఆర్‌బీకే సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ రైతులకు సూచనలు చేశారు. ఎక్కడా ఎండు తెగులు కానీ ముడత తెగులు కానీ ఆశించకుండా రైతు భరోసా కేంద్ర వీఏఏలు క్షేత్రస్థాయి పరిశీలనలు రైతులకు మేలు చేకూర్చాయి. మేలైన వంగడాలైన నెల్లూరు సన్నాలు, బీపీటీలు, 72,74, 94 రైతు పరిశోధన సంస్థ వారు అందించిన వంగడ విత్తనాలను నారు పోసి రైతులు నారు పెంపకం చేపట్టడంతో పంటలకు మేలు చేసినట్లయింది. కొన్ని చోట్ల పొట్ట దశకు పంట పొలాలు చేరుకోగా మరికొన్ని పొలాలు మంచి దుబ్బు కట్టి ఉన్నాయి. గత ఏడాది మాదిరి ఈ సంవత్సరం కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులంటున్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



పొదిలి జగనన్న లేఔట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ ఎండీ



ఎండీ సమక్షంలో గృహాలు ప్రారంభించుకుంటున్న లబ్ధిదారులు

- ఉగాది నాటికి 5 లక్షల ఇళ్లు పూర్తి
- రాష్ట్ర గృహ నిర్మాణశాఖ ఎండీ లక్ష్మీషా

పొదిలి రూరల్: నవరత్నాలు–పేదలందరికి ఇళ్ల కార్యక్రమంలో భాగంగా పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ జి.లక్ష్మీషా స్పష్టం చేశారు. బుధవారం పొదిలి విశ్వనాథపురంలోని జగనన్న లేఔట్‌ను ఆయన పరిశీలించారు. తొలుత జగనన్న లే ఔట్ మొత్తం కలయ తిరిగారు. అనంతరం లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగహన కల్పించారు. పూర్తైనా ఇళ్లను లబ్ధిదారులతో కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేయించారు. నిర్మాణాలు మొదలు పెట్టని లబ్ధిదారులతో శంకుస్థాపన చేయించారు. నిర్మాణంలో ఉన్న గృహాలు పరిశీలించి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎండీ లక్ష్మీషా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాష్ట్రంలో 31 లక్షల మంది నిరు పేదలకు ఇళ్లు నిర్మించాలానేది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచన అన్నారు. రాష్ట్రంలో 17 వేల జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రలో వచ్చే ఉగాది నాటికి 5 లక్షల ఇళ్లు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పేదలందరికీ ఇళ్లు ఉండాలనేది ప్రభుత్వం ఉద్దేశమని, ఇల్లు మంజూరైనా ప్రతి లబ్ధిదారుడు కచ్చితంగా గృహాలు నిర్మించుకోవాలని చెప్పారు. చాలాచోట్ల లబ్ధిదారులు ఉత్సహంగా ముందుకొచ్చి గృహ నిర్మాణాలు చేపట్టారన్నారు. లబ్ధిదారులకు ఏదైనా సాయం అవసరమైతే చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పొదిలి అర్బన్ లేఔట్‌లో మంచి విలువైన స్థలంలో 1603 ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు. లేఔట్‌లో 29 కోట్ల రూపాయలతో రోడ్లు లెవల్, నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, అన్ని వసతులు కల్పించామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్లు నిర్మించుకోవాలని ఎండీ లక్ష్మీషా కోరారు. ఆయన వెంట నియోజకవర్గ స్పెషలాఫీసర్ జగన్నాథరావు, హౌసింగ్ పీడీ పేరయ్య, డీఈ పవన్‌కుమార్, కనిగిరి, మార్కాపురం ఈఈలు వెంకటస్వామి, కోటిరెడ్డి, మున్సిపాల్ కమిషనర్ డానియల్ జోసఫ్, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎవరికి వారే యమునా తీరే

- మూడు ముక్కలాటలా ఎన్‌టీఆర్ వర్ధంతి కార్యక్రమం
- ఇదేం ఖర్మ అంటున్న కార్యకర్తలు

ఉలవపాడు: వారంతా ఒకే పార్టీ నాయకులు.. కానీ ఒకరంటే ఒకరికి పడదు. ఈ సమయంలో వచ్చిన ఎన్‌టీఆర్ వర్ధంతి వారిలో విబేధాలు మరోసారి బయటపడ్డాయి. దీంతో కార్యకర్తలు ఎవరితో మాట్లాడితే ఎవరు ఏమనుకుంటారో అని అందోళన పడిన పరిస్థితి మండల పరిధిలో జరిగింది. బుధవారం కరేడులో ఎన్టీఆర్ వర్ధంతి సభ నిర్వహించారు. ఇందులో టికెట్ ఆశిస్తున్న ముగ్గురు నాయకులు వారి వారి అనుచరగణంతో వేర్వేరుగా హాజరై తమ విబేధాలను అందరికీ చూపించారు. ప్రస్తుత పార్టీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాంతో కలిసి వర్ధంతిలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు తన అనుచరులతో కలిసి అదే కార్యక్రమానికి హాజరయ్యారు. నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ తరువాత తన వర్గంతో అదే గ్రామంలో కార్యక్రమంలో పాల్గొన్నారు. ముగ్గురు వేర్వేరుగా తమ అనుచరులతో హాజరుకావడంతో టీడీపీలో ఉన్న విబేధాలు ఎన్టీఆర్ వర్ధంతి సాక్షిగా మరోసారి బహిర్గతం అయ్యాయి. అసలే పార్టీ ఇబ్బందుల్లో ఉంటే వీరి గోల ఏంటి అని కార్యకర్తలు అంటున్నారు.

ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

కంభం: స్థానిక సర్కిల్ పరిధిలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని షెడ్యూల్డు కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు ఎస్పీ మలికాగర్గ్‌ను కోరారు. సోమవారం కంభం పోలీసుస్టేషన్‌ను సందర్శించిన ఎస్పీని ఆయన శాలువాతో సన్మానించి అంబేడ్కర్ డైరీ, క్యాలెండర్‌ను అందజేశారు. ఈ ప్రాంతంలో ఫ్యామిలీ గొడవలు ఎక్కువగా జరుగుతున్నాయని, స్టేషన్‌కు వచ్చిన వారిని డిపార్టుమెంట్ ద్వారా కౌన్సిలింగ్ ఇస్తే వారు కలిసి జీవించే వీలుంటుందన్నారు. అటువంటి వారి కోసం ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఎస్పీకి ఆయన వినతి పత్రం అందజేశారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన శిక్షలు

బేస్తవారిపేట: వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని గిద్దలూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మధు ప్రియాంక హెచ్చరించారు. ఫారెస్ట్ డిప్యూటీ డైరెక్టర్ వైవీ నరసింహారావు ఆదేశాల మేరకు వన్యప్రాణుల సంరక్షణపై మండలంలోని జేబీకే పురంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వన్యప్రాణులను చంపితే ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా ఉంటుందన్నారు. 1972 వన్యప్రాణుల చట్టం ప్రకారం వన్యప్రాణులకు ఎటువంటి హాని తలపెట్టవద్దని సూచించారు. వేటకు సంబంధించిన కుక్కలు, మారణాయుధాలు, లైసెన్స్ లేని తుపాకులు కలిగి ఉండటం నేరమన్నారు. డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి.రంగారెడ్డి, బీట్ ఆఫీసర్ కళ్యాణి, సర్పంచ్ భర్త తిరుపతయ్య గౌడ్ పాల్గొన్నారు.